

తెలంగాణ గంగావతరణం

నేడే కాళేశ్వరం వార్షికోత్సవం

బరాజ్‌లు:	3
రిజర్వాయర్లు:	15
సబ్‌స్టేషన్లు:	19
పంప్‌హౌజ్‌లు:	21

సొరంగాల పొడవు **203** కిలోమీటర్లు

గ్రావిటీ కెనాల్స్ పొడవు **1531** కిలోమీటర్లు

ప్రెజర్ మెయిన్స్ పొడవు **98** కిలోమీటర్లు

నీటి నిల్వ సామర్థ్యం **141** టీఎంసీలు

లిఫ్టింగ్ ఎత్తు **530** మీటర్లు

240 కాళేశ్వరం ద్వారా టీఎంసీల నీటి వినియోగం

జన జీవనంపై జల ముద్ర

ప్రతి రంగంపైనా కాళేశ్వర ప్రభావం

కాళేశ్వర నిర్మాణం నవజీవన దృశ్యాన్ని కనుల ముందు సాక్షాత్కరింపజేసింది. వ్యవసాయరంగంతో పాటు అనేక రంగాలను బతికించింది. బహుముఖీనా అభివృద్ధికి కారణమైంది. తాగు, సాగు నీటి అవసరాలను తీర్చడంతో పాటు మత్స్య, పాడి పరిశ్రమలకు పునరుజ్జీవం పోసింది. పారిశ్రామిక, పర్యాటక రంగాలకు ఊతమిచ్చి, రాష్ట్ర ఖజానాకు ఆదాయం సమకూర్చింది. సమైక్యపాలనలో పడావు పడ్డ ప్రాజెక్టులకు జలకళను తెచ్చి, బీడు భూముల్లో పచ్చదనం నింపింది. నాటి కరువునేలను ముద్దాడిన కాళేశ్వరగంగ జలపరవళ్లతో తెలంగాణ సస్యశ్యామలమైంది. జీవవైవిధ్యం, పాడిపంటలతో బతుకుచిత్రం మార్చింది. వలస బతుకులను మళ్లీ పల్లెబాట పట్టించింది. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పథకాలకు సరికొత్త రూపమిచ్చింది. అందుకే 'కాళేశ్వరం' ఓ అద్భుత సాహసం, ఇంజినీరింగ్ ప్రతిభకు చిహ్నమని ప్రపంచమంతా కొనియాడింది అంటూ స్టేట్‌బ్యూరో ప్రతినిధి మ్యాకం రవికుమార్ రాసిన ప్రత్యేక కథనం.

పడావుపడ్డ ప్రాజెక్టులకు, బీళ్లకు అండ
సిరుల ధాన్యాన్ని కురిపించిన కొండ

- తరగని భూగర్భ జలాలభాండాగారం
- సాగు, తాగునీటికి అక్షయతూణీరం
- మత్స్యసంపద వృద్ధికి దోహదకారి
- పాడిపరిశ్రమ అభివృద్ధికి ఉపకారి
- వలస బతుకులు మార్చిన ఆలయం
- జీవవైవిధ్యానికి ఆధునిక దేవాలయం

(మ్యాకం రవికుమార్)

హైదరాబాద్, జూన్ 20 (నమస్తేతెలంగాణ): సీఎం కేసీఆర్ మానసపుత్రిక కాళేశ్వరం ఎత్తిపోతల పథకం తెలంగాణ జల ప్రదాయినిగా నిలుస్తున్నది. నవజీవనానికి బాటలు పరుస్తున్నది. రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చి వేస్తున్నది. సాంకేతిక పరిజ్ఞానంలోనూ, నిర్మాణ కౌశలంలోనూ, బహుముఖ ప్రయోజనాలను అందిస్తూ ప్రపంచానికే తలమానికంగా మారిన కాళేశ్వరం ప్రాజెక్ట్ ఫలాలు ఇప్పుడు తెలంగాణకు అందుతున్నాయి. మొత్తంగా ప్రాజెక్టు కింద ఉన్న 13 జిల్లాల రూపురేఖలు మారిపోతున్నాయి. రెండుపంటలకు భరోసా లభించగా, కొత్తగా ఆయకట్టు అభివృద్ధి చెందుతున్నది. గడిచిన కొన్నేండ్లుగా పంటల దిగుబడి ఆయా జిల్లాల్లో గణనీయంగా పెరగడమే అందుకు నిదర్శనం. ప్రతీఇంట ధాన్యం సిరులు తొణికిసలాడటంతో రైతన్న ఆదాయం పెరిగింది. వలసలు ఆగిపోయాయి. అదేవిధంగా ప్రాజెక్టు కింద ఉన్న జిల్లాల్లో భూగర్భజలాల మట్టం కూడా రికార్డుస్థాయిలో పెరిగింది. మత్స్య సంపద ఎంతో అభివృద్ధి చెందింది. నీటి వనరుల గణనీయ వృద్ధితో ఆయా జిల్లాల్లో పర్యావరణ సమతుల్యత నెలకొంటుండడంతో పాటు విదేశీపక్షులు, జంతుజాలం వచ్చిచేరుతున్నది. అలా తెలంగాణ గడ్డ జీవవైవిధ్య నిలయంగా మారుతున్నది.

జీవ వైవిధ్యానికి నిలయం

నీటి వనరులున్న చోటనే జీవజాతులు ఆవాసాలను ఏర్పరచుకోవడం సహజమే. కాళేశ్వరం ప్రాజెక్టు.. రాష్ట్ర సహజ జీవావరణ వ్యవస్థలోనూ గణనీయమైన మార్పును తీసుకువస్తున్నది. పచ్చదనానికి ఊపిరిపోస్తున్నది. జీవవైవిధ్యతను పెంపొందిస్తున్నది. తత్ఫలితంగా రాష్ట్రం ఎల్లలు దాటిన దశాబ్దాల కిందటి వలసపక్షులు సొంత గూటికి చేరుతున్నాయి. మానేరులో కనువిందు చేస్తున్నాయి. కవ్వాల్ రిజర్వ్ ఫారెస్టుకు మహారాష్ట్రలోని తడోబా, తిప్పేశ్వరం రిజర్వ్ ఫారెస్ట్ నుంచి పులులు వలసవస్తున్నాయి. పోచారం అభయారణ్యంలో కృష్ణజింకలు ఏళ్ల తర్వాత దర్శనమిచ్చాయి. దాదాపు 17 ఏండ్ల అనంతరం భూపాలపల్లి ప్రాంతంలో పెద్దపిల్లులు సందడి చేస్తున్నాయి.

శ్రీరాం సాగర్‌కు కొత్త కళ

ఉమ్మడి ఏపీలో గోదావరిపై నిర్మాణం జరిగిన ఒకే ఒక్క భారీ ప్రాజెక్టు ఇది. 1964లో ప్రాజెక్టు పనులు మొదలుపెడితే రెండు దశాబ్దాలపాటు కొనసాగాయి. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయి నీటి విడుదల ప్రారంభించేనాటికే ప్రధాన జలాశయం సామర్థ్యం 12 టీఎంసీలు తగ్గింది. కాల్వలన్నీ పూర్తయ్యేసరికి మరో పది టీఎంసీల సామర్థ్యం తగ్గింది. అప్పటికీ ఉమ్మడి రాష్ట్రంలో దిద్దుబాటుకు ఏవైనా చర్యలు చేపట్టారా? అంటే అదీ లేదు. పైగా ఆయకట్టుకే దిక్కులేని ఎస్సారెస్పీని ఆధారంగా చేసుకుని ఎస్సారెస్పీ స్టేజీ 2 చేపట్టారు. పూర్తైన కాలువలు సైతం నీళ్లు ఇవ్వకుండానే శిథిలావస్థకు చేరుకున్న దుస్థితి. అయితే రాష్ట్ర ఏర్పాటు తరువాత ఎస్సారెస్పీకి కేసీఆర్ కొత్తజీవాన్ని అద్దారు. మిడ్‌మానేరు, వరద కాలువ పెండింగ్ పనులను పూర్తిచేశారు. అంతేకాదు కాళేశ్వరం ప్రాజెక్టుతో ఎస్సారెస్పీని అనుసంధానించారు. వరద కాలువను రిజర్వాయర్‌గా తీర్చిదిద్దారు. అటు ఎస్సారెస్పీకి ఎత్తిపోసుకునే ఏర్పాట్లు చేశారు. ఇటు వరద కాలువ నుంచి ఎస్సారెస్పీ కాకతీయ కెనాల్‌కు ఎల్ఎండీ దిగువ ఆయకట్టుకు జలాలను అందించేందుకు లింక్ కెనాల్‌లను ఏర్పాటు చేశారు. వెరసి ఎస్సారెస్పీ ప్రాజెక్టు చరిత్రలోనే సువర్ణాధ్యాయం మొదలైనట్లయింది. కాళేశ్వరంతో శ్రీరాంసాగర్‌పై భారం గణనీయంగా తగ్గింది. లోయర్‌మానేరు డ్యామ్ ఎగువన ఉన్న ఆయకట్టుతో పాటు జలాశయం మీద ఆధారపడిన లక్ష్మీ, సరస్వతి కాల్వలు, లిఫ్టు పథకాలకు జలాశయం నుంచి నీటిని అందించారు. ఎల్ఎండీ దిగువన ఉన్న 9.68లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టుకు కాళేశ్వర జలాల్ని అందించారు. అందుకే చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఆర్నెళ్ల పాటు కాకతీయ కాల్వలో ఆరు వేల క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతున్నది.

సాగుకు అనుబంధం- పర్యాటక బంధం

ఉమ్మడి పాలనలో గోదావరి బేసిన్‌లో కొన్ని ప్రాంతాలకే రిజర్వాయర్లు పరిమితమయ్యాయి. కానీ కేసీఆర్ అందుకు భిన్నంగా రాష్ట్రంలోని నలుమూలలా రిజర్వాయర్లను విస్తరించారు. నదులు, ఉపనదుల మీదనే కాకుండా ఆఫ్‌లైన్ రిజర్వాయర్లకూ ప్రాధాన్యతనిచ్చారు. కాళేశ్వరంలో భాగంగా రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ, బస్వాపూర్ ఇలా చెప్పుకుంటూ అనేక రిజర్వాయర్లను నిర్మించారు. ఇవిగాకుండా మిషన్‌కాకతీయ ద్వారా చెరువుల పూడికతీత చేపట్టి, చెక్‌డ్యామ్‌ల ద్వారా కూడా రాష్ట్రంలో నీటినిల్వ సామర్థ్యాన్ని పెంచారు. తద్వారా పచ్చదనం పెరిగి మత్స్య, పాడిపరిశ్రమ, గొర్రెల పెంపకం తదితర రంగాలకూ ఊతమిస్తూ ఉపాధిబాటలు పరుస్తుండడం విశేషం. రిజర్వాయర్లకు తోడు ఉచిత చేపల పంపిణీ కార్యక్రమం మత్స్య పరిశ్రమ అభివృద్ధికి మరింత ఊతమిచ్చింది. భారీ రిజర్వాయర్లు అందుబాటులోకి రావడంతో అవి టూరిస్ట్ డిస్టినేషన్‌గా కూడా మారుతున్నాయి. రంగనాయకసాగర్, మల్లన్నసాగర్‌లే ఉదాహరణ. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారానే రాష్ట్రంలో నీటి నిల్వ సామర్థ్యం ఇప్పటికే 141టీఎంసీలకు పైగా పెరిగింది. ఇదిగాకుండా వాగులన్నింటిపైనా చెక్‌డ్యామ్‌లను నిర్మిస్తున్నారు. ఇలా మొత్తంగా ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టు రాడార్‌లోనే 500టీఎంసీలకు పైగా నీరు నిల్వచేసుకునే స్థాయికి తెలంగాణ ఎదిగింది.

కాళేశ్వరం ప్రాజెక్టు కీలకఘట్టాలు

- శంకుస్థాపన–02.05.2016
- ప్రారంభం–21.06.2019
- మేడిగడ్డ నుంచి అన్నారం పంప్‌హౌజ్ ప్రారంభం–22.06.2019
- సుందిళ్ల బరాజ్ ప్రారంభం–21.07.2019
- ఎల్లంపల్లి నుంచి నంది మేడారం జలాశయానికి ఎత్తిపోతలు– 05.08. 2019
- శ్రీరాజరాజేశ్వర జలాశయం నుంచి ఎగువ మానేరుకు నీటి మళ్లింపు– 11.08.2019
- శ్రీరాజరాజేశ్వర జలాశయం నుంచి అనంతసాగర్‌కు ఎత్తిపోతలు– 16.03.2020
- అనంతగిరి జలాలు రంగనాయకసాగర్‌కు–11.03.2020
- రంగనాయక సాగర్ నుంచి మల్లన్నసాగర్‌కు జలాలు– 24.04.2020
- మల్లన్న సాగర్ నుంచి కొండపోచమ్మ సాగర్‌కు జలాలు– 21.05.2020
- కొండపోచమ్మసాగర్ నుంచి నిజాంసాగర్‌కు జలాలు–06.04.2021

పరిశ్రమలకు నీరు ఖజానాకు రాబడి జోరు

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ప్రభుత్వం 16 టీఎంసీలను పారిశ్రామిక అవసరాలకు కేటాయించింది. తద్వారా పరిశ్రమల నుంచి ఏటా రూ.4530.56 కోట్ల ఆదాయం సమకూరుతుందని అంచనా. ఎన్టీపీసీ, రామగుండం ఎరువుల కార్మాగారం నుంచి ఇప్పుడు నీటి సరఫరా రుసుము నేరుగా కార్పొరేషన్ ఖాతాలోకి వస్తున్నాయి. కాళేశ్వరం ఎత్తిపోతలు ప్రారంభమైనాక ఎన్టీపీసీ ద్వారా పొందిన రుసుం రూ.72 కోట్లు. రామగుండం ఎరువుల కర్మాగారం నుంచి అందిన నీటి రుసుం రూ.3.25 కోట్లు. కాళేశ్వరం జలాల ఫలితంగానే సిద్ధిపేట జిల్లా ములుగులో కోకాకోలా కంపెనీ ఏర్పాటయింది. జీనోమ్‌వ్యాలీకి కూడా నీటి సరఫరా జరుగుతున్నది.

పెరిగిన భూగర్భ జలం.. బోరుబావులకు ఊతం

చెరువులను విధ్వంసం చేసి ఉమ్మడి పాలకులు తెలంగాణ ఆయువు తీశారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను చిద్రం చేశారు. కానీ కేసీఆర్ మిషన్ కాకతీయ పథకానికి శ్రీకారం చుట్టారు. చెరువుల పునరుద్ధరణ చేపట్టారు. ఉమ్మడి పాలకులు దశాబ్దాల నిర్లక్ష్యం మూలంగా చాలా చెరువులకు వరదవచ్చే మార్గాలే లేకుండా పోయాయి. ఈ నేపథ్యంలో మిషన్ కాకతీయ ఆశయాన్ని నెరవేర్చేందుకు కేసీఆర్ మరో బృహత్తర ఆలోచన చేశారు. గోదావరి జలాల్లో రాష్ట్ర మైనర్ ఇరిగేషన్ వాటా 169 టీఎంసీలు. వాటిని పూర్తిగా వినియోగించుకోవడంతో చెరువులకు జలకళను తీసుకువచ్చేందుకు ప్రణాళికలను రూపొందించారు. అందులో భాగంగానే ప్రాజెక్టులకు చెరువులను అనుసంధానించాలని నిర్ణయించారు. వాగుల పునరుజ్జీవం పేరిట చెక్‌డ్యామ్‌లు నిర్మించారు. వాటన్నింటినీ గోదావరి బేసిన్‌లోని అన్ని ప్రాజెక్టుల కాలువలతో అనుసంధానించారు. తూములు పెట్టి గొలుసుకట్టు చెరువులను అనుసంధానించారు. క్రమం తప్పకుండా చెరువులను నింపారు. తద్వారా భూగర్భజల మట్టం గణనీయంగా పెరిగింది. భూగర్భ జలాల మట్టం పెరుగుదలతో జలాల స్వచ్ఛత కూడా పెరిగింది. ఫ్లోరైడ్, ఆర్సెనిక్ తదితర హానికర మూలకాల గాఢత తగ్గిపోతున్నదని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

గోదావరి బేసిన్‌లో నీటినిల్వ సామర్థ్యాన్ని కోల్పోయిన రిజర్వాయర్లు (టీఎంసీలలో)

ప్రాజెక్టు	నిర్మాణ స్టోరేజీ	ప్రస్తుత స్టోరేజీ	కోల్పోయిన నిల్వసామర్థ్యం	ఆయకట్టు (ఎకరాల్లో)
ఎస్సారెస్పీ	112	80.5	31.52	13,66,000
సింగూరు	29.92	28.27	1.63	40,000
నిజాంసాగర్	29.71	17.38	12.33	2,31,000
కడెం	7.6	4.6	2.9	68,000
అప్పర్‌మానేరు	3	2.09	0.91	13,086
దిగువ మానేరు	24.04	22.75	1.29	(ఎస్సారెస్పీ ఆయకట్టు)
మొత్తం	205.64	153.59	50.05	17,18,086

(నోట్: కేవలం ఈ ప్రాజెక్టుల కిందనే దాదాపు 25శాతం ఆయకట్టుకు నీటి లోటు ఉండగా, దానిని కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా స్థిరీకరిస్తున్నారు.)

కాళేశ్వరం ద్వారా వివిధ ప్రాజెక్టుల్లో స్థిరీకరించిన ఆయకట్టు..

ప్రాజెక్టు	ఆయకట్టు (ఎకరాల్లో)
శ్రీరాంసాగర్ 1అండ్ 2	6,10,000
ఎస్సారెస్పీ వరద కాలువ	1,00,000
ఎల్లంపల్లి ప్రాజెక్టు	1,51,000
నిజాంసాగర్	2,31,000
శ్రీరాజరాజేశ్వర జలాశయం	1,10,000
అనంతగిరి, రంగనాయకసాగర్, కొండపోచమ్మ ద్వారా ..	
817 చెరువులను నింపడం ద్వారా	2.30లక్షల ఎకరాలు
66 చెక్‌డ్యామ్‌లను నింపడం ద్వారా	20,576 ఎకరాలు

(నోట్: వాస్తవంగా ఇదంతా కొత్త ఆయకట్టు కిందనే పరిగణించాల్సి ఉంటుంది. గతంలో ఇవి పేరుకే ఆయకట్టు. సాగునీరు ఇచ్చిన దాఖలాల్లేవు)

సింగూరుకు మోక్షం నిజాంసాగర్‌కు జీవం

ఉమ్మడి పాలకులు కుట్రపూరితంగా పుష్కలంగా నీటి లభ్యత ఉన్న ప్రాణహిత, ఇంద్రావతి బేసిన్‌లను వదిలి నీరు లభించని ప్రాంతాల్లో తెలంగాణ ప్రాజెక్టులను నిర్మించారు. అరకొర నీటినిల్వ సామర్థ్యంతో నిర్మించిన ఆ ప్రాజెక్టుల్లో ప్రతిపాదిత లక్ష్యాన్ని చేరుకోకముందే పూడికతో నీటినిల్వ సామర్థ్యం పడిపోయింది.

మంజీరాపై అప్పటికే ఉన్న నిజాంసాగర్‌కు నిలువునా ఉరివేసినట్లుగా సింగూరు ప్రాజెక్టును నిర్మించారు. కేవలం దానిని హైదరాబాద్ తాగునీటి కోసమే పరిమితం చేశారు. మరోవైపు నిజాంసాగర్‌కు మరింతగా నీటిలభ్యత పడిపోవడంతో ఆయకట్టుకు పడావు పడ్డది. మానేరుపై ఎగువ మానేరు, దిగువ మానేరు ప్రాజెక్టులకు నీరు రాని దుస్థితి. అయితే కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ఉమ్మడిపాలకులు సృష్టించిన శతకోటి సమస్యలకు పరిష్కారం చూపింది. పాత ప్రాజెక్టుల ఆయకట్టుకు భరోసానివ్వడమేగాక కొత్త ఆయకట్టుకు పురుడుపోస్తున్నది. ఎగువ నుంచి వరద వచ్చినా, రాకున్నా ఎల్లంపల్లికి, ఎగువ, మధ్య, దిగువ మానేరుకు కాళేశ్వర గంగ శాశ్వత భరోసా కల్పించింది. మంజీరా మొహం చాటేసినా, సింగూరుకు కాళేశ్వరం ఊపిరులూదింది. ఆయకట్టుకు మోక్షం లభించింది. హల్దీ వాగుద్వారా చారిత్రక నిజాంసాగర్‌కు ప్రాణహిత జలాలతో కాళేశ్వరం ప్రాణం పోస్తున్నది.

తాగునీటికి శాశ్వత భరోసా

కాళేశ్వరం ప్రాజెక్టు పథకం ద్వారా మిషన్ భగీరథతో తాగునీటికి శాశ్వత భరోసా లభించింది. ప్రాజెక్టులో భాగంగా 30టీఎంసీలను హైదరాబాద్ తాగునీటికి, 10టీఎంసీలను ఎన్‌రూట్ గ్రామాల తాగునీటికి కేటాయించారు. హైదరాబాద్‌కు తాగునీటి కరువన్నదే లేని పరిస్థితి కాళేశ్వరం ద్వారా సాధ్యమైంది. నిజాం రాజు నిర్మించిన హుస్సేన్‌సాగర్, ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జంట జలాశయాలే తప్ప 60 ఏండ్ల ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ తాగునీటికే అంకితం చేస్తూ నిర్మించిన ఏ ఒక్క జలాశయము లేదు. తొలుత సింగూరు నుంచి, అది చాలకపోవడంతో కృష్ణా నుంచి, తుదకు గోదావరి నుంచి జలాల తరలింపు చేపట్టారు. అయినప్పటికీ భాగ్యనగరవాసుల దాహార్తిని తీర్చలేని దుస్థితి. కారణం ఉమ్మడి పాలకుల అనుసరించిన విధానలోపం. అయితే, హైదరాబాద్‌కు శాశ్వత భరోసాను కల్పించింది కాళేశ్వరం. దీని ద్వారా హైదరాబాద్ చెంతనే నగర జనాభా నీటి అవసరాల కోసం 65టీఎంసీలు స్టోరేజీ అందుబాటులోకి వచ్చింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా 15టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన కొండపోచమ్మ రిజర్వాయర్, 50 టీఎంసీల సామర్థ్యంగల మల్లన్నసాగర్ ఇందులో భాగమే.

హైదరాబాద్ నీటి అవసరాల అంచనాలు.. (టీఎంసీల్లో)



దేశంలోని పలు మెట్రో నగరాల్లో తాగునీటి డిమాండ్.. సరఫరా.. లోటు ఇలా..(ఎంజీడీల్లో)

నగరం	డిమాండ్	సరఫరా	లోటు
ఢిల్లీ	1150	950	200
ముంబయి	777.59	637.91	139.68
చెన్నై	505	345	160
బెంగళూరు	475	383	92
హైదరాబాద్	460	468	+8

నేను మీ కాళేశ్వర గోదావరిని..

మొదటిపేజీ తరువాయి...

సురగంగ కన్నా వేగంగా వస్తున్న ఈ గంగను కండ్లకు అద్దుకున్న పాపాన పోలేదు. నాలుగు రోజుల తర్వాత వెనక్కి తిరిగి చూసుకుంటే.. మళ్లీ నా దారి పిల్ల కాల్వ కన్నా చిన్నగా మారి వెక్కిరించేది!

ఉమ్మడి రాష్ట్రంలో మీరెన్ని వెతలు అనుభవించారో.. నేనన్ని కష్టాలు మోసుకెళ్లాను. మీ గట్టుమీద పడ్డ ప్రతి చినుకునూ ఒడిసిపట్టి.. వడ్డీ సహా మీకిద్దామని ఎంతగా పరితపించేదాన్నో! ఆ అవకాశమే లేకుండా చేశారు. ఎవరో కాటన్ దొర. మన తెలుగువాడు కాదు. ఆ మాటకొస్తే మన భారతీయుడే కాదు! అయినా, అనంత జలరాశి అఖాతంలోకి వెళ్లిపోతే.. రైతుల బతుకులు ఆగమైతయని భావించాడు. దశాబ్దాల కిందటే నాకు కట్ట కట్టి.. కోనసీమను ఆవిష్కరించాడు. నన్ను నమ్ముకున్నవాళ్ల బతుకులు ఎంతగా మారిపోయాయో.. మీకు ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. మీ గుండెల నిండుగా పారుతున్నా.. మీ ఆకలి తీర్చలేకపోయినందుకు నా కడుపు తరుక్కుపోయి నురగలు కక్కేదాన్ని.

> నా ఆక్రందన అర్థం చేసుకున్న మొదటి నాయకుడు మన కేసీఆరే! ఉద్యమ సమయంలో ఎన్నేసి సార్లు.. ఎన్నేసి రూపాయి బిల్లలు నా ఒడిలో వేసి దండం పెట్టుకునేవాడో! ఆ సమయంలో 'తల్లీ! రాష్ట్రం అచ్చినాంక.. నీ నీళ్లతో తెలంగాణ అంతా పునీతం చేస్తా' అని తన మనసులోనే అనుకునేవాడు. ఆ మాటలు నా జలకింకిణుల హోరుకు కొత్త ఉత్సాహాన్నిచ్చేవి. 'నీళ్లు.. నిధులు.. నియామకాలు..' ఎజెండాగా ఎత్తిన ఉద్యమ జెండాను ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా పక్కనపెట్టలేదు. రాష్ట్రాన్నంతా కదిలించి అనుకున్న తెలంగాణ సాధించాడు. ఈ ఉద్యమబాటలోనే తెలంగాణలోనూ ఘనంగా పుష్కరాలు జరిగేలా చేసి.. కాగల కార్యానికి నాంది పలికాడు కేసీఆర్.

ఆ రోజు నాకు బాగా గుర్తు. పోరుబాటలో పుష్కరాల సందర్భంగా ధర్మపురికి వచ్చాడు కేసీఆర్. నా ఒడ్డున వెలిసిన లక్ష్మీనరసింహుడికి దండం పెట్టుకున్నాడు. వచ్చే పుష్కరాలు తెలంగాణ రాష్ట్రంలో జరిగేలా ఆశీర్వదించాలని నర్సన్నను కోరుకున్నాడు. ఆయన సంకల్ప బలమో, ఆ నృసింహుడి ఆశీఃఫలితమో.. అన్నట్టుగానే నా తర్వాతి పుష్కర సంబురం మన తెలంగాణలో ఘనంగా జరిగాయి. ఆ ముచ్చటలోంచి తేరుకోకముందే.. నా నడకకు కొత్త బాట చూపించడానికి కాళేశ్వరం ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టాడు. నేనే వేగం అంటే.. నాకన్నా వడివడిగా ప్రాజెక్టును మూడున్న రేండ్ల వ్యవధిలో పూర్తి చేసి 'ఔరా!' అనిపించుకున్నాడు. ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతుంటే నాకెంత సంతోషమనిపించేదో! అంచెలంచెలుగా నన్ను ఎత్తిపోసి.. మా కొమురెల్లి మల్లన్నతో కబుర్లు చెప్పుకొనేలా చేశాడు. కొండపోచమ్మతో దోస్తీ పెంచాడు. ఎల్లంపల్లికి జలకళ తీసుకొచ్చాడు. వట్టిపోయిన శ్రీరాంసాగర్‌కు జీవం పోశాడు. నా చెల్లి మంజీరా అంటే నాకు ప్రాణం. నేను పుట్టిన్నాటి నుంచి ఎక్కడెక్కడి నుంచో అమృత తుల్యమైన నీటిని మోసుకొచ్చి నాలో కలిపి.. నా రుచిని పెంచేది. అలాంటి మంజీరా నాదాలు మృగ్యమైపోయిన వేళ.. నన్ను నా చెల్లికి ఉపనదిని చేసి, తన రుణం తీర్చుకునే అవకాశం కల్పించాడు కేసీఆర్. బరాజ్‌లు, జలాశయాలు, కాల్వలతో భారతావనిలోని నదులన్నింటిలో నన్ను మిన్నగా నిలబెట్టిన కేసీఆర్ దార్శనికుడు, ధన్యుడు, మాన్యుడు!

అనంత ప్రవాహంతో తెలంగాణలో ఆనందతాండవం చేస్తున్న నన్ను చూసి కొందరికి ఎందుకో కడుపు రగిలిపోతున్నది. తెలంగాణ సాధించిన ఆ యోధుడిపై అక్కసుతో.. నన్ను బలి తీసుకునేందుకు కుట్రలు చేస్తున్నారు. ఆరేండ్లుగా మీ వెన్నంటి నడిచిన నన్ను మీకు దూరం చేసేందుకు పాచికలు విసురుతున్నారు. కాళేశ్వరంపై లేనిపోని అభాండాలు వేసి.. ఈ జలభాండాగారాన్ని ఎండపెడుతున్నారు. నేను మీకు ఇద్దామనుకున్న వాటాను.. పూటుగా మరొకరికి ధారాదత్తం చేసేందుకు యత్నిస్తున్నారు. కానీ, ఈ కుట్రలను ఛేదించడం నాకు పెద్ద కష్టమేం కాదు. కాలమే సమాధానం చెబుతుంది. కాళేశ్వరం ఎంత గొప్పదో మళ్లీ రుజువు అవుతుంది. నా ప్రవాహమంత వేగంగా నిజం నిరూపితమవుతుంది. తెలంగాణకు కాళేశ్వరం జీవగర్ర అని నా నీళ్లంత స్వచ్ఛంగా సత్యం వెలుగు చూస్తుంది. కాళేశ్వర గోదావరిగా మీకు నేనిస్తున్న హామీ ఇది! బేసిన్ అంటే ఏంటో, బేసన్ అంటే ఏంటో తెలియని పాలకుల ప్రాపకం ఇంకెంత కాలం చెల్లుబాటు అవుతుంది? నా ఆనుపానులు తెలిసిన కేసీఆరే మళ్లీ మీ ముఖ్యమంత్రి కావడం ఖాయం. పల్లెపల్లెకూ వచ్చి నేను పల్లవించడం నిశ్చయం.